క్లుప్తంగా

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు (పిట్టల వానిపాలెం): చందోలులో వేంచేసిన బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. హరిద్ర శృంగార్చన కార్యక్రమంలో పాల్గొని, వివాహం నిశ్చయమైన వారికి తలంబ్రాలు, దుస్తులు దేవస్థానం తరుపున అందజేయడం జరుగుతుందని అర్చకులు తెలిపారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

క్రికెట్ పోటీలు ప్రారంభం



రేపల్లె: పిరాట్లలంకలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు తోట రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీలను సచివాలయాల మండల కన్వీనర్ కాగితాల కృష్ణకిషోర్ ప్రారంభించారు. రాంబాబు మాట్లాడుతూ ఎంపీ మోపిదేవి సహకారంతో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. సర్పంచ్‌లు వడ్డీ సునీత శ్రీనివాసరావు, కారాని కృష్ణ కుమారి శ్రీనివాసరావు, నాయకులు గొట్టిపాటి దేవర్ధనరావు, చాట్రగడ్డ మోహన్‌రావు, గొట్టిపాటి శివాజీ, కనపర్తి వీరాస్వామి, నీలా రవికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి కొలుపులు



రేపల్లె రూరల్: గంగడిపాలెం పంచాయతీ మృత్యుంజయపాలెంలో అంకమ్మతల్లి కొలుపులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. జాతరలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, గుర్రం మురహరి రావు, విజయలక్ష్మి, పార్థసారధి పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ముగిసిన శిబిరం



భట్టిప్రోలు: మాటూరు రామారావు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ దారా రవి కిరణ్మయి విచ్చేసి, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు బొలిశెట్టి శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్ బజయ్య, దారా చెన్నయ్య, గంథ్రాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

వీనుల విందుగా ప్రవచనాలు



కర్లపాలెం: బుద్ధాం గ్రామంలో శ్రీమద్ రామాయణ జ్ఞాన యజ్ఞం వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి చిన్మయానంద, శారదా ప్రియానంద మాతాజీ దివ్య అనుగ్రహంతో శీలానంద మాతాజీ సుందరకాండ ప్రవచనాలు, భజగోవిందం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 18 వరకు ప్రవచనాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం పూజ్య స్వామిని శీలానంద భక్తులనుద్దేశించి అనుగ్రహణ భాషణ చేశారు.

వైభవంగా శత చండీయాగం

పాత గుంటూరు: ఏటీ అగ్రహారంలోని శ్రీ కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరంలో ఆదివారం శత చండీ యాగం వైభవంగా నిర్వహించారు. ఉదయం సూర్య నమస్కారాలు, మహాలింగార్చన, వేద పారాయణతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

పార్కును కాస్త పట్టించుకోండి..!

- నిర్వహణ లేక అధ్వానంగా మున్సిపల్ పార్క్
- ముళ్ల పొదలు పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..
- మందుబాబులకు, జూదరులకు స్థావరంగా మారిన వైనం
- శిథిలమైన సామగ్రి, నిర్వహణకు ఇద్దరు కార్మికులు



మద్యం బాటిళ్లు, ధ్వంసమైన బల్లలు



ముళ్ల పొదలతో అధ్వాన్నంగా ఉన్న పార్కు

బాపట్ల అర్బన్: పార్కు అంటే కుటుంబంతో ఆహ్లాదంగా గడిపే ప్రదేశం. కానీ ఇక్కడ మాత్రం అసాంఘిక కార్యకలాపాలకు నిలయం. పిల్లలను రారమ్మని ఆహ్వానించే ఊయలలు విరిగి, మూలకు చేరాయి. బెంచీలు ముక్కలయ్యాయి. పరిసరాలు.. ముళ్ల చెట్లతో పాడు పనులకు ఆవాసమయ్యాయి.

బాపట్ల జిల్లా ఏర్పడిన అనంతరం పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో పార్కు నిర్మించారు. దీంతో ఆ ప్రాంతం సుందరంగా తయారైంది. స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి సహకారంతో ఈ పార్కు నిర్మాణానికి పునాది పడింది. అయితే మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఈ పార్కు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

పట్టించుకునే నాథుడు లేడు

స్థానిక పెయింటర్స్ కాలనీలోని ఈ పార్కులో పిల్ల ల ఆట వస్తువులు ఉన్నాయి. వాకర్స్ సేద తీరడానికి బెంచీలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు ఈ పార్కు నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించడంతో ఇప్పుడు అవన్నీ మూలకు చేరాయి. పార్కులోని వెల్డింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ కార్మికుల కార్యాలయాలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ పార్కు ఆలనాపాలనా చూసే నాథుడు లేడు.

శిథిలమైన పార్కు నిర్వహణకు ఇద్దరు కార్మికులు

సదరు పార్కు ప్రస్తుతం వినియోగంలో లేదు. కానీ, ప్రతి రోజూ ఇద్దరు కార్మికులు పనిచేస్తున్నారు. వీరు పార్కుకు వచ్చి వెళ్లడమే విధి నిర్వహణ. అయితే పార్కులో ఏం జరుగుతోంది, పారిశుద్ధ్య నిర్వహణ పట్టించుకున్న దాఖలాలు లేవు. మునిసిపల్ ఉన్నతాధికారులు కూడా కనీసం పార్కు వైపు కన్నెత్తి చూడటం లేదు.

అసాంఘిక కార్యకలాపాల నిలయం

ప్రస్తుతం పార్కు.. ముళ్లపొదలు పెరిగిపోవడంతో అసాంఘిక కార్యకలాపాల నిలయంగా మారింది.

మందు బాబులు ప్రతి రోజు మద్యం సేవిస్తూ నానా హంగామా చేస్తున్నారు. తాగి పడేసిన మద్యం సీసాలు, సిగరేట్ ప్యాకీలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. జూదానికి ఆవాసంగా మారింది. దీంతో ఆ ప్రాంతంలో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

> **పరిశీలించి, అభివృద్ధి చేస్తాం**
>
> పార్కును పరిశీలించి, అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా పార్క్ ఆధునీకీకరణకు చర్యలు తీసుకోలేకున్నాం. ఉన్న నిధులను రోడ్డు విస్తరణ, తదితర పనులకు ఉపయోగిస్తున్నాం.
>
> – ఎ.భానుప్రతాప్, మున్సిపల్ కమిషనర్, బాపట్ల

సీపీఎం నేత రాఘవులు మృతికి మంత్రి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి నాగార్జున, బావుడా చైర్మన్

అక్కివారిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు సీపీఎం నాయకుడు, మండల కార్యదర్శి జి. సుధాకర్ తండ్రి రాఘవులు గుండె పోటుతో మృతి చెందడంతో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించారు. పలు పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి. రమాదేవి, ముమ్మనేని వెంకట సుబ్బయ్య, భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, పెదపులివర్రు సర్పంచ్ ఎస్. ఉషారాణి, టి.కృష్ణమోహన్ నివాళులర్పించారు.

బాధితులకు ఆర్థిక చేయూత



బాధితులకు సాయమందించిన దాతలు

రేపల్లె రూరల్: పట్టణంలోని 3వ వార్డులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని సర్వం కోల్పోయిన మందా సత్యనారాయణ, అతని కుటుంబ సభ్యులకు పలువురు ఆదివారం చేయూతనిచ్చారు. దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో పెనుమూడికి చెందిన దీవి గోపాలకృష్ణమాచార్యులు రూ.5వేలు, సారథి నూతన వస్త్రాలు అందజేశారు. రేపల్లె పట్టణానికి చెందిన ఆర్కే కంటి ఆసుపత్రి నిర్వాహకులు రామకృష్ణ బియ్యం ఇచ్చారు. కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, కొండవీటి అగస్త్యశాస్త్రి, పాతూరి రాజీవ్ పాల్గొన్నారు.

కొండవీటి వాగులో తూటుకాడ తొలగించాలి

పసుపు రైతుల రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర్



ర్యాలీ నిర్వహిస్తున్న పసుపు రైతుల రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర్

తాడేపల్లిరూరల్: కొండవీటి వాగులో ఉన్న తూటికాడను తొలగించాలని, కొండవీటి వాగుని ప్రక్షాళన చేయాలని పసుపు రైతుల రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు కోరారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి కొండవీటి వాగును రైతు సంఘం నాయకులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొండవీటి వాగు మొత్తం తూటాకుతో నిండిపోయి ఉందని, నీరు ముందుకు సాగక వెనక్కి తన్ని మంగళగిరి, తుళ్లూరు, తాడేపల్లి మండలంలోని కొన్ని వేల ఎకరాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. గతంలో సీఆర్‌డీఏ, ఇరిగేషన్ అధికారులు మీన మేషాలు లెక్కించి సకాలంలో స్పందించకపోవడం వలన వేల ఎకరాలు మునిగిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, ఉండవల్లి రైతు సంఘం అధ్యక్షులు బక్కిరెడ్డి, వీరాస్వామి, షేక్ ఎర్రబురు కోనపరెడ్డి రమేష్, బుజ్జి, పోతురాజు రెడ్డి, దండమూడి సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రాచీన చిత్రకళలపై ముగిసిన వేసవి శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

తెనాలి: భారతీయ సంప్రదాయ చిత్ర కళాకారిణి వేజండ్ల నవ్య నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ఈఓట మల్లీశ్వరి ప్రదానం చేశారు. శ్రీలక్ష్మీ కూచిపూడి నృత్య కళానికేతన్ వెంకటలక్ష్మి సహకారంతో వేజండ్ల వెంకట సుబ్బారావు స్మారక ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులకు ప్రాచీన చిత్రకళలు వర్లీ, మండాల, మధుబని, జింటాంగిల్, డూడుల్ కళలపై అవగాహన కల్పించారు. ముగింపు సభలో పర్యవేక్షకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, ఓంకార్ గ్రాఫిక్స్ ప్రసాద్, భీమవరపు శివ రామకృష్ణ, షేక్ అబ్దుల్ హకీంజాని పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలను విడుదల చేస్తున్న వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ తదితరులు

కొమ్మూరు(కాకుమాను): రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సాహెబ్ (జిలాని)అన్నారు. మండలంలోని కొమ్మూరు మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ జగన్‌కే సాథ్' అనే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ క్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పథకాల్ని అందిస్తున్న ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. రాష్ట్ర కేబినెట్‌లో సైతం ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పొన్నూరు షేక్ కరిముల్లా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముజావర్ షేక్ లతీఫ్ పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ తల్లి కొలుపులు

తూములూరు(కొల్లిపర): తూములూరు గ్రామంలోని గంగానమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం ఘనంగా కొలుపులు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, చీర, గాజులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అమ్మవారకి చీర, పసుపు, కుంకుమ సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈమని హరికోటిరెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈద హర్షవర్ధన్ రెడ్డి, బొమ్ము వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో సీజ్

తాడేపల్లిరూరల్: రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను ఆదివారం సీజ్ చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. టాటా ఎస్ ఆటోలో 105 మూటల్లో 5 క్వింటాళ్ల 250 కేజీల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఎస్‌బీ ఇచ్చిన సమాచారం మేరకు ఆటోను సీజ్‌చేసి ఆటో నడుపుతున్న ఎన్‌టీఆర్ కట్టకు చెందిన చిట్టిబోతుల జోజిబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జెండా పండుగ



కొమ్మూరు(కాకుమాను):మండలంలోని కొమ్మూరులో శనివారం జెండా పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఉదయం నుంచి జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి నిర్వహించిన ప్రార్థనల్లో ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత పాల్గొన్నారు.అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన జెండాను ఆదివారం వేకువజాము వరకు గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్న సంతర్పణ నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివ రామకృష్ణ, కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, మత పెద్దలు పాల్గొన్నారు.

పెదనందిపాడు పోలీస్ స్టేషన్ తనిఖీ



పెదనందిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్ బాషా ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డుల్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించాలని ఆయన సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో పలు కేసుల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు, ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ ఉన్నారు.

జూదరుల అరెస్టు

తిమ్మాపురం (ప్రత్తిపాడు): పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురు జూదరుల్ని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం తిమ్మాపురం గ్రామ శివారుల్లోని ఖాళీ ప్రదేశంలో కోత ముక్కాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో ఎస్ఐ డి. రవీంద్రబాబు సిబ్బందితో దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి, రూ. 1150 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ చెప్పారు.

చాకలి ఐలమ్మ అపర కర్మశాల ప్రారంభం



కర్మశాలను ప్రారంభిస్తున్న అక్కల శ్రీరామ్

తెనాలి: పట్టణంలోని రజక పేటలో నూతనంగా నిర్మించిన చాకలి ఐలమ్మ అపర కర్మశాల ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. మునిపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులు అక్కల శ్రీరామ్ ప్రారంభించారు. కళ్లేపల్లి ఆంజనేయులు, కాకర్ల అశోక్‌బాబు, మంగళగిరి–తాడేపల్లి మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ వల్లూరి లక్ష్మీపతిరావు, పోతార్లంక శివ నాగమల్లేశ్వరరావు, నెప్పల్లి రాంబాబు, బేతపూడి హిమాచలరావు, నిడుబ్రోలు సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి కోటేశ్వరరావు, ఈపినగళ్ల శంకర్, చాట్రగడ్డ ఆంజనేయులు, ఉప్పలపాటి సాయికృష్ణ, రజకవర్గానికి చెందిన పెద్దలు, బేతపూడి సాంబశివరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థులతో వైఎస్ ఎంపీపీ, గ్రంథాలయాధికారి



బహుమతులు అందజేసిన సర్పంచ్ లలితకుమారి

కొల్లూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు మురాల రాంబాబు పేర్కొన్నారు. 35 రోజులుగా కొల్లూరు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలు ఆదివారం జరిగాయి. శిక్షణ శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు రాంబాబు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి వై.రాంబాబు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

కర్లపాలెం: కర్లపాలెం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఆటలు, వ్యాస రచన, చిత్రలేఖనం తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు స్థానిక సర్పంచ్ నక్కా లలితకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని, బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సమితి నిర్వాహకులు

భట్టిప్రోలు: పేద విద్యార్థులకు ఉన్నతికి మూడు దశాబ్దాలకు పైగా శ్రీ సాయి ఆర్య వైశ్య విద్యా సమితి కృషి చేస్తోందని కార్యదర్శి మానేపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సేవా సమితి 34వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం భట్టిప్రోలులో 6వ తరగతి నుంచి బీటెక్ ఆర్యవైశ్య విద్యార్థులు 130 మందికి నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే 16 మంది మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ కింద రూ.25 వేలు అందజేశారు. సుబ్బారావు మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో సమితి పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సేవా సమితి అధ్యక్షుడు పులికొండ అక్కేశ్వర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోశాధికారి మానేపల్లి సాయి గణేష్ కుమార్, వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినేట్ సెక్రటరీ నంబూరు నాగభూషణరావు, వాసవి దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా, శ్రీ షిర్డి సాయిబాబా మందిర కమిటీ నిర్వాహకులు తమ్మన రమేష్, భట్టిప్రోలు హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు(బీఎస్సార్), మాజీ జెడ్పీటీసీ సభ్యులు తూనుగుంట్ల శ్రీధర్, ఉపాధ్యాయులు సీహెచ్ ఉమామహేశ్వరరావు, సభ్యులు మానేపల్లి శైలజ కుమారి, మానేపల్లి శశికళ, దుర్గామహి తదితరులు పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

రూ. 7 లక్షల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న ఐలవరం వాసులు

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం దళితవాడలో ఆదివారం ప్రమాదవశాత్తూ రెండు పూరిళ్లుఅగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో గ్రామానికి చెందిన పంతగాని సుబ్బారావు(సుబ్బులు), పప్పల నాగరాజుకు చెందిన పూరిళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. ఈ ప్రమాదంలో రూ.7 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. రేపల్లె అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చే లోపు.. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. విషయం ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

హోరాహోరీగా వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్ అందుకుంటున్న క్రీడకారుడు

కొల్లూరు: వైఎస్ఆర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. కొల్లూరు బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో ఆదివారం పలు జట్లు తలపడ్డాయి. జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ నేతృత్వంలో టోర్నమెంట్ జరుగుతోంది. మూడో రౌండ్‌లో చిలుమూరు జట్టు పెసర్లంకపై గెలుపొందగా, జువ్వలపాలెంపై దోనేపూడి టీం విజయాన్ని దక్కించుకుంది. ఆవులవారి పాలెం జట్టుపై వలివేరు వీసీబీ యూత్ జట్టు గెలుపొందింది. రెండో రౌండ్‌లో అనివార్య కారణాల కారణంగా నిలిచిపోయిన మ్యాచ్‌ను తిరిగి నిర్వహించగా, కొల్లూరు జట్టు వెల్లటూరు జట్టుపై గెలుపొంది మూడో రౌండ్‌కు అర్హత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్‌లను నిర్వాహకులు అందజేశారు.

వంతెనను ప్రారంభించండి..

అప్రోచ్ రోడ్డు లేక నిరుపయోగంగా పెదపులివర్రు వంతెన



పురాతనమైన పెదపులివర్రు వంతెన



పెదపులివర్రు వద్ద నిర్మించిన నూతన వంతెన

భట్టిప్రోలు: ఆరేళ్ల క్రితం కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పై పెదపులివర్రు, ఓలేరు గ్రామాల వద్ద వంతెనలను రూ1.76 కోట్లతో చేపట్టి, పూర్తి చేయడం జరిగింది. ఇటీవల అప్రోచ్ రోడ్డు వేయడంతో ఓలేరు వంతెనపై రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ, పెదపులివర్రులో మాత్రం బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెనపైనే ప్రస్తుతం రాకపోకలు సాగుతున్నాయి. భట్టిప్రోలు, రేపల్లె, తెనాలి ప్రాంతాల నుంచి లంక గ్రామాలకు లారీలు, ఆటోలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఈ వంతెన ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వాహనం వస్తే..తప్పుకునేందుకు కష్టతరంగా మారింది. దీంతో తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. పెదపులివర్రు వంతెన శిథిలావస్థకు చేరింది. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. నిర్మాణం పూర్తైన నూతన వంతెన అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో.. నిరుపయోగంగా మారింది. రూ.90 లక్షలతో పెదపులివర్రు, రూ.86 లక్షలతో ఓలేరు వంతెనలను ఏక కాలంలో పూర్తిచేసినా.. ఓలేరు వంతెనకు అప్రోచ్ రోడ్డు వేసి, పెదపులివర్రుకు వేయకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

> **ఆ బాధ్యత ఆర్అండ్‌బీ అధికారులదే..**
>
> అప్రోచ్ రోడ్డు వేయడం ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోనిది. వంతెన ప్రారంభించకపోవడంతో వాహనదారుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
>
> – కె.రవిబాబు, ఏఈ, ఇరిగేషన్, వెల్లటూరు.